సాక్షి ఖమ్మం

బుధవారం ၊ 9 ၊ జూలై ၊ 2025



పత్తి మొలకలు అంతంతే..

వర్షాభావ పరిస్థితులతో పత్తి మొలక శాతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు మరోమారు విత్తనాలు నాటుతున్నారు. 8లో



నాణ్యత తప్పనిసరి

అభివృద్ధి వేగంగా చేపట్టడమే కాక నాణ్యత పాటించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 24°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షం కురిసే అవకాశముంది. మిగతా ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు విడుదల

నేలకొండపల్లి: గ్రామపంచాయతీల్లోని మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలను ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో దశల వారీగా ఆందోళనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యాన మూడు నెలల వేతనంగా రూ.5.95కోట్లను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి ఖాతాలో జమ చేశారు. వీటిని రెండు రోజుల్లోగా కార్మికులకు అందించేలా జీపీల వారీగా ఖాతాల్లో జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీల్లో 2,088 మంది మల్టీపర్పస్ వర్కర్లు పనిచేస్తుండగా వారికి ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి నెలకు రూ.9,500 చొప్పున రూ.28,500 వేతనం అందనుంది.

మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు ప్రారంభం



విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. జాతీయ, అంతర్జాతీయ డిమాండ్లు లేవని సోమవారం జెండా పాట నిర్వహించాక కొనుగోళ్లు చేయబోమని వ్యాపారులు వెనుకడుగు వేసిన విషయం విదితమే. దీంతో రైతులు రాత్రి మార్కెట్‌లోనే సరుకు నిల్వ చేశారు. అయితే, రైతులు పంటల సాగుకు పెట్టుబడి కోసం మిర్చి విక్రయిస్తున్నందున వారిని ఇబ్బంది పెట్టొద్దని మార్కెట్ కమిటీ బాధ్యులు, అధికారులు సూచించడంతో వ్యాపారులు చాంబర్ కార్యాలయంలో సమావేశమై కొనుగోలుకు నిర్ణయించారు. దీంతో సోమవారం నిల్వ చేసిన మిర్చితో పాటు మంగళవారం తీసుకొచ్చిన సరుకును కొనుగోలు చేశారు. కాగా, ఏసీ మిర్చి క్వింటాకు గరిష్టంగా రూ.13,300, కనిష్ట ధర రూ.10,100గా నమోదైంది. నాన్ ఏసీ మిర్చి ధర అత్యధికంగా రూ.12,650, కనిష్టంగా రూ.5వేలతో కొనుగోలు చేశారు. అయితే ఏసీ మిర్చి అత్యధికంగా జెండా పాటతో కాక రూ.12,600 మోడల్ ధరతోనే కొనుగోలు చేసినా చేసేదేం లేక రైతులు అప్పగించారు.

ముగిసిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగి

ఖమ్మం సహకారనగర్: ఎప్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పించేందుకు చేపట్టిన కౌన్సెలింగ్ మంగళవారం ముగిసింది. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 1నుంచి విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్నారు. చివరి రోజు 800 మంది స్లాట్ బుకింగ్ చేసుకోగా 780మంది హాజరయ్యారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా, కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ చందా సుధాకర్ తెలిపారు. కాగా, ఎనిమిది రోజులు సాగిన కౌన్సెలింగ్‌కు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా శంకర్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న స్పెషల్ గ్రేడ్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లకు ప్రభుత్వం తాత్కాలిక పదోన్నతులు కల్పించింది. వీరిని మెడికల్ కళాశాల ప్రిన్సిపాళ్లు, టీచింగ్ జనరల్ హాస్పటల్ సూపరింటెండెంట్లుగా నియమించారు. దీంతో యాదాద్రి భువనగిరి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ టి.శంకర్ ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. అలాగే, వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నరేందర్‌ను ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు.

విధులకు హాజరు కండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు బుధవారం నాటి సమ్మెలో పాల్గొనకుండా విధులకు హాజరై బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని డైరెక్టర్లు గౌతమ్, కె.వెంకటేశ్వరరావు, కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలెం రాజు కోరారు. దేశవ్యాప్తంగా బుధవారం సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. డైరెక్టర్లు, జీఎం తమ కార్యాలయాల్లో మంగళవారం మాట్లాడారు. కార్మిక సంఘాల డిమాండ్లలో ఒక్కటి కూడా సింగరేణికి సంబంధించినది లేదని తెలిపారు. ఈనేపథ్యాన కార్మికులు విధులకు హాజరు కావాలని సూచించారు.



నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయం



ఎంపీటీసీలు.. 284

కల్లూరు డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌తో తేలిన లెక్క

- గత ఎన్నికల్లో జిల్లాలో 289 స్థానాలు
- కల్లూరు మున్సిపాలిటీ ఏర్పాటుతో స్థానాల తగ్గుముఖం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ(ఎంపీటీసీ) స్థానాల సంఖ్య తేలింది. గత ఎన్నికల్లో 289 స్థానాలు ఉండగా ప్రస్తుతం 284కు పడిపోయాయి. జిల్లాలో కొత్తగా కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. ఈనేపథ్యాన కల్లూరు మండలంలో ఐదు ఎంపీటీసీ స్థానాలు తగ్గగా.. ఆ మండలంలో 13 స్థానాలతో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదలైంది.

గడువు ముగిసి ఏడాది..

మే 2019లో జిల్లాలోని 20 జెడ్పీటీసీ, 289 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అదే ఏడాది జూన్ 4న ఫలితాలు వెలువడగా పాలకవర్గాలను ఏర్పాటు చేశారు. అయితే 2024 జూన్‌తో పాలకవర్గాల కాలం తీరినా ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో గడువు ముగిసి ఏడాది దాటింది. పంచాయతీ ఎన్నికల తర్వాతే ఈ ఎన్నికలు ఉంటాయనే ప్రచారం జరుగుతున్నప్పటికీ ఎన్నికలకు సంబంధించి యంత్రాంగం ఏర్పాట్లు మాత్రం చేస్తోంది. ఈక్రమంలోనే గత ఎన్నికల్లో ఎన్ని స్థానాలు ఉన్నాయి, ప్రస్తుతం ఎన్ని స్థానాల్లో ఎన్నికలు నిర్వహించాలనే అంశంపై స్పష్టత వచ్చింది.

ఆ రెండు మండలాల్లో..

ఖమ్మం రూరల్ మండలంలోని పది గ్రామపంచాయతీలను పూర్తిగా, మరో రెండు జీపీల్లోని కొన్ని గ్రామాలను కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీలో విలీనం చేశారు. అయితే, ఇలా విలీనమైన గ్రామాలన్నీ కూడా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రావడంతో ఎంపీటీసీ స్థానాల్లో పెద్దగా మార్పు రాకపోగా గతంలో ఎన్నికలు జరగని ఒక స్థానం తగ్గింది. ఇదే సమయాన రఘునాథపాలెం మండలం నుంచి మూడు గ్రామపంచాయతీలు ఖమ్మం రూరల్‌లో కలవడంతో ఒక ఎంపీటీసీ స్థానం పెరిగింది. దీంతో గత ఎన్నికల్లో మాదిరిగానే ఖమ్మం రూరల్ మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలకే ఈసారి సైతం ఎన్నికలు జరగనున్నాయి. ఇక కల్లూరు మండలంలో 18ఎంపీటీసీ స్థానాలకు గాను ఐదు ఎంపీటీసీల పరిధి ప్రాంతం మున్సిపాలిటీలో విలీనమైంది. ఫలితంగా ఆ మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలతోనే డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చారు.

డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల

జిల్లాలోని ఎంపీటీసీ స్థానాలపై ఈ ఏడాది ఫిబ్రవరిలోనే జిల్లా యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. ఆ తర్వాత కల్లూరు మున్సిపాలిటీని ఏర్పాటుచేయడంతో ఆ మండలంలోని స్థానాలను పునర్విభజన చేశారు. ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ మంగళవారం వెలువడింది. దీనిపై మంగళ, బుధవారాల్లో అభ్యంతరాలను స్వీకరించి 10, 11వ తేదీల్లో పరిశీలన, పరిష్కారం అనంతరం 12న తుది స్థానాలను ప్రకటిస్తారు. ప్రభుత్వం ప్రతీ మండల పరిషత్‌లో కనీసం ఐదు ఎంపీటీసీ స్థానాలే ఉండాలని తాజా ఆదేశాల్లో పేర్కొంది. అయితే, జిల్లాలోని 20 మండల పరిషత్‌ల్లో ఐదు కన్నా ఎక్కువగానే ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.

ఆశావహుల్లో టెన్షన్

గ్రామపంచాయతీ ఎన్నికలు సెప్టెంబర్‌లోగా నిర్వహించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ఈనెలాఖరుకల్లా నోటిఫికేషన్ వస్తుందనే ప్రచారం జరుగుతోంది. ఆ తర్వాత ప్రభుత్వం పరిషత్ ఎన్నికలు నిర్వహించనుందని సమాచారం. ఈ నేపథ్యాన గత ఎన్నికల్లో పోటీచేసిన వారిలో టెన్షన్ నెలకొంది. ఎంపీటీసీలుగా గెలిచినప్పటికీ ప్రయోజనం ఉండదని.. పంచాయతీ ఎన్నికల బరిలో నిలిస్తేనే రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం అవుతామనే ఉద్దేశంతో ఆ వైపు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కూడా తొలుత పంచాయతీ ఎన్నికలకు సిద్ధమవుతుండడంతో బరిలో నిలిచి అదృష్టాన్ని పరీక్షించుకోవాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే, రిజర్వేషన్ కలిసి రాక.. ఎంపీటీసీ ఎన్నికల్లోనూ పరిస్థితులు అనుకూలించకపోతే పరిస్థితి ఏమిటనే టెన్షన్ వారిని వెంటాడుతోంది.

విద్యుత్ డివిజన్ల పునర్విభజన

- నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు
- జిల్లాలో మధిరలో ఏర్పాటుకు అవకాశం

ఖమ్మంవ్యవసాయం: మెరుగైన విద్యుత్ సరఫరా, పర్యవేక్షణ సులువయ్యేలా అవసరమైన చోట విద్యుత్ డివిజన్ల ఏర్పాటుకు ఎన్పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. విద్యుత్ కనెక్షన్లు పెరుగుతుండడం, విద్యుత్ వినియోగం గరిష్ట స్థాయికి చేరుతుండడంతో పర్యవేక్షణ కోసం నియోజకవర్గాల వారీగా నూతన డివిజన్ల ఏర్పాటుకు కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో కొత్తగా మధిర విద్యుత్ డివిజన్ ఏర్పాటుకానుంది. జిల్లా యూనిట్‌గా విద్యుత్ సర్కిళ్లను ఏర్పాటుచేసి, అక్కడి భౌగోళిక స్థితి ఆధారంగా డివిజన్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఖమ్మం సర్కిల్ పరిధిలో ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, వైరా, సత్తుపల్లి విద్యుత్ డివిజన్లు కొనసాగుతున్నాయి. కాలక్రమంలో పెరుగుతున్న కనెక్షన్లు, వినియోగం ఆధారంగా సబ్ స్టేషన్లను పెంచినా డివిజన్లలో మార్పులు లేకపోవడంతో ఉద్యోగులపై భారం పడుతోంది. ఈ నేపథ్యాన ఉన్నత స్థాయి సమీక్షలో కొత్త డివిజన్ల ఏర్పాటుకు నిర్ణయించారు.

మధిర కేంద్రంగా డివిజన్

జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు గాను ఖమ్మం టౌన్(ఖమ్మం), ఖమ్మం రూరల్(పాలేరు), వైరా, సత్తుపల్లి విద్యుత్ డివిజన్లు కొనసాగుతున్నాయి. మధిర నియోజకవర్గం వైరా, ఖమ్మం రూరల్ డివిజన్ల పరిధిలో ఉండగా.. నియోజకవర్గానికొక విద్యుత్ డివిజన్ ఏర్పాటు నిర్ణయంతో మధిరను ఎంపిక చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో కొత్త విద్యుత్ డివిజన్ ఏర్పాటు చేయనుండగా... మిగతా నాలుగు డివిజన్లలోనూ మార్పులు, చేర్పులు జరగనున్నాయి.



బోనకల్‌లో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న ఎస్ఈ, అధికారులు

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ సమీక్ష

ఖమ్మం వ్యవసాయం/బోనకల్: నియోజకవర్గాల విద్యుత్ డివిజన్ల ఏర్పాటు అంశంపై ఖమ్మంలోని ఎస్ఈ కార్యాలయంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్(హెచ్ఆర్డీ) సి.ప్రభాకర్‌రావు అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితులు, మధిరలో డివిజన్ ఏర్పాటుకు ఉన్న సానుకూలతలపై చర్చించగా.. అధికారుల అభిప్రాయాలు సేకరించారు. ఆతర్వాత బోనకల్ మండల కేంద్రంలో విద్యుత్ డివిజన్ కార్యాలయం, అసిస్టెంట్ డివిజన్, రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించగా క్షేత్రస్థాయిలో డైరెక్టర్ సహా అధికారులు పరిశీలించారు. ఈసమావేశాల్లో ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, అధికారులు బాబూరావు, నంబూరి రామారావు, నాగేశ్వరరావు, రాములు, భద్రుపవార్, కిరణ్ చక్రవర్తి, వెంకటేశ్వర్లు, యాదగిరి, బండి శ్రీనివాసరావు, హరిప్రవీణ్, శేషగిరిరావు, నర్సింహారెడ్డి, రమేష్, రాజేష్, అర్జున్, గోవిందరావు పాల్గొన్నారు.

క్యూలో నిలబడకుండా..



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారు ఓపీ చీటీ కోసం ఇకపై గంటల కొద్దీ క్యూలైన్లలో నిలుచునే అవసరం లేదు. తాజాగా ఆస్పత్రిలో క్యూ ఆర్ కోడ్‌తో టోకెన్ తీసుకునే వెసులుబాటు కల్పించారు. ఆస్పత్రికి వచ్చే వారు ఏబీడీఎం యాప్ ద్వారా అక్కడి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే టోకెన్ నంబర్ వస్తోంది. ఈ నంబర్ ఆధారంగా వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవచ్చు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

వేలిముద్ర.. ఇక సులభం

- రేషన్‌షాప్‌ల్లోని ఈ–పాస్ యంత్రాలకు కొత్త స్కానర్లు
- మండలాల వారీగా సిబ్బంది నియామకం

నేలకొండపల్లి: రేషన్ షాప్‌ల్లో బియ్యం తీసుకునేందుకు పలువురు లబ్ధిదారుల వేలిముద్రలు ఈ–పాస్ యంత్రాల్లో సరిగ్గా నమోదు కాక తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్డుదారుల్లో చాలా మందికి ఇదే సమస్య ఎదురవుతుండగా బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతోంది. ఈనేపథ్యాన ప్రభుత్వం ఈ–పాస్ యంత్రాలలో కొత్త స్కానర్లను అమర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న యంత్రాల్లోని స్కానర్లను ఎల్–0 నుంచి ఎల్–1కు మార్చే ప్రక్రియను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చేపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,191 స్కానర్లు

వరద ముంపు ఎదురవుతుందనే భావనతో రేషన్ షాప్‌ల ద్వారా మూడు నెలల కోటా బియ్యాన్ని జూన్‌లో ఒకేసారి పంపిణీ చేశారు. మళ్లీ సెప్టెంబర్ వరకు బియ్యం పంపిణీ లేకపోవడంతో అధికారులు షాప్‌ల్లోని ఈ–పాస్ యంత్రాలకు కొత్త స్కానర్లు అమర్చడంలో నిమగ్నమయ్యారు. ఇందు కోసం పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రత్యేక సిబ్బందిని నియమించి మండలాల వారీగా స్కానర్లు మార్పిస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని 748, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 443 దుకాణాల షాపుల యంత్రాల్లో కొత్త స్కానర్లు బిగించే పనులు చకచకా జరుగుతున్నాయి. ఖమ్మం జిల్లాలో ఇప్పటికే 314 షాప్‌ల్లో స్కానర్లు మార్చడం పూర్తయిందని అధికారులు తెలిపారు.



తిరుమలాయపాలెంలో యంత్రాల స్కానర్లు మారుస్తున్న సిబ్బంది

సమాచారం భద్రం

రేషన్ దుకాణాలకు తొలుత ఐదేళ్ల క్రితం ఈ–పాస్ యంత్రాలను పంపిణీ చేశారు. అయితే, సాంకేతిక పరిజ్ఞానం మారడంతో అవి మొరాయిస్తుండగా రెండేళ్ల క్రితం మళ్లీ కొత్తవి అందించారు. కానీ వీటి ద్వారా సాంకేతిక సమస్యలు వస్తుండడం.. ప్రధానంగా లబ్ధిదారుల వేలిముద్రలు సరిగ్గా నమోదు కావడం లేదని గుర్తించిన రాష్ట్ర సివిల్ సప్లయీస్ అధికారులు మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ–పాస్ యంత్రాల్లో ఎల్–0కు బదులు ఎల్–1 స్కానర్లు అమర్చే ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. తద్వారా వేలిముద్రల నమోదు సమస్య ఎదురుకాదని, ఆధార్ సమాచారం కూడా భద్రంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

14 అడుగులకు చేరిన పాలేరు



పాలేరు రిజర్వాయర్

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు ఆదివారం రాత్రి నుండి సాగర్ జలాలు చేరుతుండగా 12 అడుగులు ఉన్న నీటిమట్టం మంగళవారం సాయంత్రం 14 అడుగులకు చేరింది. సాగర్ నుండి మరో మూడు రోజుల పాటు నీటి సరఫరా కొనసాగనుంది. సాగర్ నుండి రిజర్వాయర్‌కు 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా రిజర్వాయర్ నీటి మట్టం 20అడుగులకు చేరే అవకాశముంది. దీంతో తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి. అలాగే, సాగర్ ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో దిగువకు విడుదల చేస్తుండగా, సాగునీటి అవసరాలకు సైతం నిర్ణీత సమయానికే పాలేరుకు విడుదల చేసే అవకాశముంది.

సంక్షేమంపై ఫోకస్..

- గురుకులాల్లో వసతి, సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఐఏఎస్ అధికారులు
- సమస్యల గుర్తింపు.. ఆపై పరిష్కారానికి కార్యాచరణ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ గురుకులాలు, వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈనేపథ్యాన విద్యార్థులకు సరిపడా డార్మిటరీ రూమ్‌లు, బెడ్లు ఉన్నాయా, లేదా.. వంట గదుల పరిశుభ్రతపై ఐఏఎస్ అధికారులు నేరుగా ఆరా తీస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.. ఇంకా ఏయే వసతులు కల్పించాలనే అంశాలు తెలుసుకుంటున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్లు, కేఎంసీ కమిషనర్ గురుకులాలను సందర్శిస్తుండడంతో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐఏఎస్ అధికారులు గురుకులాలను స్వయంగా సందర్శిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా జిల్లాలోని పలు గురుకులాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య గత మూడు రోజుల నుంచి పరిశీలిస్తున్నారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి మౌలిక సదుపాయాలపై ఆరా తీయడమే కాక బోధన సామర్థ్యాలను పరీక్షిస్తున్నారు.

కనీసం వసతులు కల్పించేలా..

క్షేత్రస్థాయి పర్యటనలో అధికారులు ప్రధానంగా విద్యార్థులకు అందుబాటులో ఉన్న కనీస వసతులపై దృష్టి సారించారు. డార్మిటరీ రూమ్‌ల పరిస్థితి, విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా బెడ్లు ఉన్నాయా లేదా, గదుల పరిశుభ్రత, వెంటిలేషన్ వంటి అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, టాయిలెట్లు, స్నానాల గదుల వంటి ప్రాథమిక అవసరాలపై ఆరా తీస్తున్నారు.



గురుకులంలో తనిఖీ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

నివేదికల సమర్పణ..

అధికారులు తమ పరిశీలనలో గుర్తించిన సమస్యలపై నివేదికలను ప్రభుత్వానికి అందజేయనున్నారు. తద్వారా ప్రభుత్వం గురుకులాల్లోని సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోనుంది. నేరుగా ఐఏఎస్ స్థాయి అధికారులు రంగంలోకి దిగడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం నివేదికలను పక్కన పెట్టకుండా వాటి ఆధారంగా సమస్యలు పరిష్కరిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బోధన సాగుతోందా.. సమస్యలు ఉన్నాయా?

సత్తుపల్లిటౌన్/పెనుబల్లి: పాఠాలు అర్థమవుతున్నాయా, సిలబస్ ఎంత వరకు అయింది.. అంటూ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి విద్యార్థులను ఆరా తీశారు. సత్తుపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల, పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లలోని సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి, వసతి గదులు, వంటశాల, సరుకులను పరిశీలించాక విద్యార్థులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే, వర్షాలు కురుస్తున్నందున పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం సత్తుపల్లి గురుకుల విద్యార్థులతో కలిసి అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రిన్సిపాల్ కె.వెంకటరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెనుబల్లి : విద్యార్థులతో కలిసి పాఠం వింటున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కమ్యూనిస్టులతోనే సమస్యల పరిష్కారం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

కారేపల్లి: కమ్యూనిస్టులు అండగా నిలిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయనే విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కారేపల్లి మండలం మాధారంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికే పార్టీ ఆవిర్భవించిందని చెప్పారు. పదవులు ఉన్నా, లేకున్నా పేదవారి పక్షాన పోరాడేతత్వం కమ్యూనిస్టులకు ఉంటుందని తెలిపారు. కాగా, డిసెంబర్ 26న సీపీఐ వందేళ్ల వేడుకల ముగింపు సభ ఖమ్మంలో నిర్వహించనున్నామని వెల్లడించారు. కాగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్న విషయాన్ని అందరూ గుర్తించాలని కోరారు. అలాగే, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు భాగం హేమంతరావు, యర్ర బాబు, సీతామహాలక్ష్మి, రావి రామకృష్ణ, ఉంగరాల సుధాకర్, పోటినేని సత్యనారాయణ, బట్టు సంగయ్య, చెన్నంశెట్టి భూషయ్య, దళ్‌సింగ్, బట్టు సంగయ్య, బి.వీరునాయక్, కొల్లి వీరయ్య, రాయల రామారావు, పోతనబోయిన సహదేవ్, పి.రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన నాయకులు

క్లుప్తంగా

సార్వత్రిక సమ్మెకు యూఎస్‌పీసీ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెక ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) జిల్లా స్టీరింగ్ కమిటీ మద్దతు ప్రకటించింది. ఖమ్మంలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు పారుపల్లి నాగేశ్వరరావు, టి.వెంగళరావు మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దు, ధరల నియంత్రణ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనాలు, పని గంటల తగ్గింపునకు చేపడుతున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. అలాగే, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటి అద్దెను ఆదాయ పన్ను నుండి మినహాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు రంజాన్, ఏ.వీ.నాగేశ్వరావు, నాగమల్లేశ్వరరా వు, రాంబాబు, కె.వెంకటేశ్వరావు, మల్సూర్, దామోదర్, రామోజీ, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యాలయాల్లో ప్రవేశానికి స్పాట్ కౌన్సెలింగ్

భద్రాచలంటౌన్: ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హ్యూమాటిక్స్ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉండగా, గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 2024–25లో ఎస్సెస్సీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 11న చర్లలోని ఏకలవ్య విద్యాలయంలో జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు అన్ని ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్‌తో హాజరు కావాలని పీఓ సూచించారు.

వసతి గృహాల్లో ప్రవేశాలు పెరగాలి

ఖమ్మంమయూరిసెంటర్:వసతిగృహాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి ఎక్కువ మంది విద్యార్థులు చేరేలా ఉద్యోగులు కృషి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాలసత్యనారాయణ సూచించారు. ఖమ్మంలోని అంబేడ్కర్ భవన్‌లో వసతిగృహ సంక్షేమాధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. అన్ని ఎస్సీ వసతిగృహాల్లో సీట్లు ఖాళీగా ఉన్నందున విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ఏదైనా హాస్టల్‌లో సంఖ్య పెరిగితే సమీప హాస్టల్‌కు పంపించాలని చెప్పారు. అలాగే, విద్యార్థుల వివరాలను ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. తెలంగాణ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రుక్మారావు, ఏఎస్‌డబ్ల్యూఓలు పాల్గొన్నారు.

భూసేకరణపై అభ్యంతరాల స్వీకరణ

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం నుంచి అమరావతి వరకు నూతన రైల్వే లైన్ ఏర్పాటుతో భూములు కోల్పోనున్న రైతులతో మండలకేంద్రంలోని రైతు వేదికలో అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఉషాశారద భూములు కోల్పోతున్న రైతుల వివరాలు వెల్లడించారు. ఈ అంశంపై అభ్యంతరాలు ఉంటే సమర్పించాలని సూచించారు. ఐపీటీ రైల్వే డీటీ వీరభద్రనాయక్, ఆర్ఐ ఎస్ రవికుమార్, మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బాల పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఆపదలో ఉన్న బాలబాలికలను రక్షించిన బాలలు, స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. నూతన ఆవిష్కరణలు, అసాధారణ ప్రతిభాపాటవాలు, ఆటలు, కళలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్యసాహసం అంశాల్లో అవార్డులు అందిస్తారని వెల్లడించారు. ఐదేళ్ల మొదలు 18 ఏళ్ల లోపు బాలబాలికలతో పాటు ఏడేళ్ల లోపు బాలబాలికల సంరక్షణకు పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల బాధ్యులు https:// awards. gov. in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆతర్వాత దరఖాస్తు ప్రతులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,900	4,650
కందులు	6,302	6,302
మిర్చి	12,650	5,000
ఏసీ మిర్చి	13,300	10,100
మిర్చి తాలు	6,300	5,200
పత్తి	7,800	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,463

పత్తి మొలకలు అంతంతే..

- వర్షాభావ పరిస్థితుల్లో తగ్గిన మొలక శాతం
- పలు ప్రాంతాల్లో రెండోసారి విత్తనాలు నాటుతున్న రైతులు
- ఫలితంగా పెరగనున్న పెట్టుబడి భారం



పత్తి రైతులకు సూచనలు చేస్తున్న డీఏఓ పుల్లయ్య (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాలు అనుకూలించకపోవడంతో పత్తి మొలక శాతం తగ్గింది. ఫలితంగా మొలకెత్తని చోట రైతులు రెండోసారి విత్తనాలు పెడుతున్నారు. దీనికి తోడు వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో పత్తి సాగు లక్ష్యం చేరలేదు. జిల్లాలో ఈ ఏడాది 2,20,550 ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేయగా, ఇప్పటి వరకు 1,78,171 ఎకరాల్లోనే విత్తనాలు నాటినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో వరి తర్వాత అత్యధికంగా పత్తి సాగవుతుంది. ఇక్కడి నేలలు అనుకూలంగా ఉండటంతో రైతులు మెట్ట పంటగా పత్తి సాగుకు ప్రాధాన్యత ఇస్తారు.

మరోమారు...

జూన్ వర్షపాతం 131.2 మి.మీ.కు గాను 123.9 మి.మీ. మాత్రమే నమోదైంది. ఈ వర్షం కూడా జూన్ 29, 30వ తేదీల్లోనే కురిసింది. ఈ ప్రభావం పత్తిసాగుపై పడింది. ఇక జూన్ చివరి రెండు రోజులు, జూలై మొదటి రెండు రోజులు మంచి వర్షాలు కురవడంతో మొలకెత్తిన పత్తికి ప్రాణం పోయగా, మొలక రాని చోట మరోసారి విత్తనాలు పెట్టేందుకు దోహదపడ్డాయి. దీంతో చాలాచోట్ల రైతులు అరకొరగా ఉన్న పత్తి మొక్కలను తొలగించి రెండోసారి విత్తే పనిలో నిమగ్నమయ్యారు. ఈ కారణంగా విత్తనాలు, దుక్కి దున్నడం, పాటు చేయటం, కూలీల ఖర్చులు కలిపి అదనంగా ఎకరాకు మరో రూ.8వేల నుంచి రూ.10 వేల వరకు వెచ్చించాల్సి వచ్చింది.

అనుకూలించని వానలు

పత్తి పంట విత్తేందుకు ఈ ఏడాది వానలు అనుకూలించలేదు. సీజన్‌కు ముందే వర్షాలు కురవడంతో రైతులు ఆశగా సాగుకు ముందడుగు వేసినా ఆతర్వాత రుతుపవనాల ప్రభావం మందగించింది. సాధారణంగా రుతుపవనాలు జూన్ 8 తర్వాత తెలుగు రాష్ట్రాలను తాకుతాయి. ఈసారి మాత్రం మే నెల 25నుంచే వర్షాలు మొదలయ్యాయి. ఈమేరకు మే చివరి వారం, జూన్ మొదటి వారంలో పత్తి విత్తనాలు నాటగా... కొందరు పొడి దుక్కుల్లోనే విత్తనాలు పెట్టారు. ఆతర్వాత జూన్ మూడో వారం వరకు వానలు ముఖం చాటేయడం.. పత్తి విత్తాక 15 – 20 రోజులు వర్షం లేకపోవడంతో మొలకశాతం పడిపోయింది.

ఈనెల మూడో వారం వరకు అవకాశం

పత్తి విత్తనాలు నాటేందుకు ఈనెల మూడో వారం వరకు అవకాశముందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1.78 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈనెల 20వ తేదీ నాటికి లక్ష్యం చేరే అవకాశముందని భావిస్తున్నారు. తొలుత జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 6,61,662 విత్తన ప్యాకెట్లు అందుబాటులోకి తీసుకురాగా, రైతులు రెండోసారి కొనుగోలు చేస్తుండడంతో అదనంగా 8,697 విత్తన ప్యాకెట్లు సమకూర్చారు. ఇవికాక మరో లక్ష విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు.

రెండుసార్లు విత్తా..



రెండెకరాల్లో పత్తి నాటాను. వర్షాలు లేక మొలకలు రాలేదు. దాదాపు 50 శాతం మొలకెత్తకపోవటంతో మరోమారు విత్తనాలు నాటాం. వానలు సక్రమంగా కురిస్తేనే ఈ విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంది.

– బత్తుల ప్రసాద్, పండితాపురం, కామేపల్లి మండలం

లక్ష్యం దిశగా పత్తి సాగు



జిల్లాలో పత్తి సాగు లక్ష్యం దిశగా సాగుతోంది. వానలు అనుకూలించక అక్కడక్కడా రెండోసారి విత్తుతున్నారు. ఈనెల మూడోవారం వరకు నాటే అవకాశముంది. పూర్తి పదునులోనే విత్తనాలు నాటితే ఫలితముంటుంది.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

పత్తి కొనుగోళ్లలో కొత్త విధానానికి ఓకే..



మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు

ఖమ్మంవ్యవసాయం: పత్తి కొనుగోళ్లలో కేంద్రప్రభుత్వం ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న పీడీపీఎస్(ప్రైస్ డిఫరెన్స్ పేమెంట్ పథకం)ను స్వాగతిస్తున్నామని ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులు తెలిపారు. ఖమ్మంలోని వర్తక సంఘం భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో చాంబర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతో పాటు మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు మాట్లాడారు. పత్తి కొనుగోళ్లలో పీడీపీఎస్ విధానాన్ని ఖమ్మం మార్కెట్‌లోనూ అమలుచేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ విధానంతో రైతులకు మేలు జరగనున్నందున అమలుకోసం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు.

దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అర్చక, ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి భూముల ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లిన ఆలయ ఈఓ రమాదేవిపై ఏపీలోని పురుషోత్తమపట్నంలో దాడి చేయడంపై అర్చక, ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈమేరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులు, అర్చకులు మంగళవారం ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఆలయ భూముల పరిరక్షణకు పాటుపడుతున్న మహిళా అధికారిపై దాడి చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. ఘటనకు బాధ్యులను చర్యలు తీసుకోవడంతో పాటు దేవాదాయ శాఖ ఉద్యోగులపై దాడులు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో అర్చక, ఉద్యోగ, ఈఓల సంఘాల ప్రతినిధులు దాములూరి వీరభద్రరావు, వీ.వీ.నర్సింహారావు, చందూరు రామకోటేశ్వరరావు, ఆనంద్, దాములూరి కృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల కేసులో మరో ఇద్దరి అరెస్ట్

రూ.1.80 లక్షల విలువైన విత్తనాలు స్వాధీనం

తల్లాడ: నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న కేసులో ఇంకో ఇద్దరు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 4న తల్లాడలోని మిట్టపల్లి సెంటర్‌లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించిన విషయం విదితమే. ఈక్రమాన కొందరిని అరెస్ట్ చేయగా పలువురు పరారయ్యారు. ఎర్రుపాలెం మండలం కాచారానికి చెందిన బ్రహ్మాజీ, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం కుదుపకు చెందిన బలగాని గోపి, కె.పర్వకు చెందిన మంగరాజు గోపి, తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన గంధం కోటేశ్వరరావు, జంగా గోపాల్‌రెడ్డి, పోట్రు శ్రీను తదితరులు ముఠాగా ఏర్పడి గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వీరిలో బ్రహ్మాజీ, నూజివీడుకు చెందిన సాంబయ్య నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేస్తున్నారని పట్టుబడిన వారు చెప్పగా తల్లాడ ఎస్ఐ వెంకటకృష్ణ వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రూ.1.80లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు, ప్యాకింగ్‌కు వాడే లేబుల్ కవర్లు, ప్యాకింగ్ మిషన్, కాంటాను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. కాగా, ఈ కేసులో మిట్టపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి, శ్రీను పరారీలో ఉన్నారని వెల్లడించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు

కొణిజర్ల: తాటిచెట్టు పైనుంచి జారి పడడంతో గీత కార్మికుడికి గాయాలయ్యాయి. మండలంలోని తనికెళ్లకు చెందిన పెరిక వెంకటేశ్వర్లు కల్లు గీసేందుకు మంగళవారం సాయంత్రం చెట్టు ఎక్కాడు. ఈక్రమంలోనే ప్రమాదవశాత్తు కాలు జారికింద పడిన ఆయన వెన్నుముకకు తీవ్ర గాయం కావడంతో 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు.

'విద్య ప్రాధాన్యతను మరిచిన ప్రభుత్వం'



సమావేశంలో మాట్లాడుతున్న పృథ్వీ

ఖమ్మంమయూరిసెంటర్: సామాజిక, ఆర్థిక, అసమానతలు కలిగిన నేటి సమాజంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా ప్రాధాన్యతను గుర్తించడం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ విమర్శించారు. ఖమ్మంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రభుత్వ విద్యారంగం విధ్వంసానికి గురైందని తెలంగాణ సమాజం రేవంత్ రెడ్డిని గెలిపించిందని తెలిపారు. కానీ కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తుండడం ఆందోళనలకు గురి చేస్తుందన్నారు. ఎన్నికల సమయాన విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పినా ఆ పరిస్థితి లేదని ఆరోపించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఆవుల అశోక్, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శిరోమణి మాట్లాడుతూ పాలకుల విద్యావ్యతిరేక విధానాలను నిరసిస్తూ విద్యార్థులు ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలనికోరారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు శశి, కార్తీక్, యశ్వంత్, సందీప్, సాధిక్, సురేష్, పుదీల పృథ్వీ, నాసిర్, అశోక్ ,శ్రీను, పేర్ల వెంకటేష్, ప్రసాద్, పాషా, ప్రాణవ్, స్టాలిన్, నరేందర్, అనూష, అఖిల పాల్గొన్నారు.

ఏకాగ్రతతో విధులు నిర్వర్తించాలి

ఆర్టీసీ డ్రైవర్ల శిక్షణ తరగతుల్లో ఏసీపీ శ్రీనివాసులు



డ్రైవర్ల శిక్షణలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఏకాగ్రతతో విధులు నిర్వర్తించాలని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు సూచించారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఖమ్మం రీజియన్ పరిధిలోని డ్రైవర్లకు విడదల వారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యాన మంగళవారం ఇచ్చిన శిక్షణలో ఏసీపీ మాట్లాడారు. ప్రమాదాలకు కారణమయ్యే మద్యపానానికి డ్రైవర్లు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం మానసిక ఒత్తిడిని అధిగమించడంపై బ్రహ్మకుమారి గీత అవగాహన కల్పించారు. ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ మల్లయ్య, ఖమ్మం, మణుగూరు డీఎంలు దినేష్‌కుమార్, శ్యాంసుందర్‌తో పాటు ఉద్యోగులు వినాయకరావు, సురేశ్ పాల్గొన్నారు.

బాల కార్మికుడి గుర్తింపు

ఖమ్మంఅర్బన్: 'ఆపరేషన్ ముస్కాన్'లో భాగంగా ఖమ్మంలోని పలు షాపుల్లో మంగళవారం వివిధ శాఖల అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇల్లెందు క్రాస్‌లోని ఒక షాప్‌లో బాలుడు పని చేస్తుండడాన్ని గుర్తించి యజమానిపై కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా సంబంధిత శాఖల సమన్వయంతో తనిఖీలు చేపడుతున్నామని వెల్లడించారు.

ప్రైవేట్ పాఠశాలలో నోట్‌పుస్తకాలు సీజ్



నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని సెయింట్ విన్సెంట్ పాఠశాల యాజమాన్యం పాఠశాల పేరిట నోట్ పుస్తకాలు ముద్రించి విద్యార్థులు విక్రయిస్తుండటంతో మంగళవారం ఎంఈఓ బి.మురళీమోహన్ రావు సీజ్ చేశారు. పాఠశాల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్నారనే సమాచారంతో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆందోళన చేపట్టి ఎంఈఓకు సమాచారం ఇచ్చారు. దీంతో తనిఖీ చేసి పుస్తకాలు నిల్వ చేసిన గదిని సీజ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు ఉగ్గం సురేష్ పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

కల్లూరు: మండలంలోని మర్లపాడుకు చెందిన కమ్మకంటి వెంకటి(35) పాము కాటుతో మృతి చెందాడు. వ్యవసాయ కూలీగా జీవనం సాగించే ఆయన మంగళవారం పొలంలో పనిచేస్తుండగా కాలిపై పాముకాటు వేసింది. దీంతో కుటుంబీకులు కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. వెంకటికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రెండేళ్ల బాలుడికి పాముకాటు

కరకగూడెం: ఓ మహిళ పొలం పనులకు వెళ్తూ తన రెండేళ్ల మనవడిని వెంటబెట్టుకెళ్లగా ఆ చిన్నారిని పాముకాటు వేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కరకగూడెం మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన ఊకే సారయ్య – నాగమణి దంపతుల కుమారుడు విక్రం ఆదిత్యను మంగళవారం ఆయన నాయనమ్మ పొలం పనులకు తీసుకెళ్లింది. సమీపాన బాబును పడుకోబెట్టి ఆమె పనుల్లో నిమగ్నం కాగా చిన్నారిని పాము కాటు వేయడంతో నురగలు కక్కుతూ స్పృహకోల్పోయాడు. దీంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన మేయర్, కమిషనర్ తదితరులు

ఖమ్మం అర్బన్: రహదారుల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టడమే కాక సకాలంలో పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం 15వ డివిజన్‌లో రూ.48.25 లక్షలతో నిర్మించే రెండు రహదారుల పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఖమ్మం నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అయితే, రహదారుల నిర్మాణం నాణ్యతగా జరిగేలా ప్రజలు కూడా పర్యవేక్షించాలని సూచించిన మంత్రి, ఆతర్వాత పరిశుభ్రతపై దృష్టి సారించాలని చెప్పారు. అంతేకాక ప్రతీఒక్కరు ఇళ్ల ఎదుట మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్‌డీఓ జి.నర్సింహారావు, తహసీల్దార్ సైదులు, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు రావూరి కరుణ, కమర్తపు మురళితో పాటు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, వాహిద్, రావూరి సైదబాబు, తుపాకుల ఏడుకొండలు, బోడా శ్రావణ్‌కుమార్, లక్ష్మణ్, లోడుగు వెంకన్న, సంక్రాంతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లన్ననగర్‌లో త్వరలోనే పాఠశాల



చిన్నారులతో డీఈఓ, డీఎంహెచ్ఓ, తదితరులు

కొణిజర్ల: మండలంలోని ఎల్లన్ననగర్‌లో పాఠశాల లేక, బయటకు వెళ్లాలంటే రహదారి లేకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి దృష్టికి పలువురు తీసుకెళ్లారు. గతంలో ఓ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు గ్రామంలో పాఠశాల నడిపించినా, ఇప్పుడు మూసివేయడంతో బడి ఈడు పిల్లలు ఇంటికే పరిమితుతున్నారని తెలియడంతో ఆయన విచారణకు ఆదేశించారు. దీంతో డీఈఓ సామినేని సత్యనారాయణ, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.కళావతిబాయి, ఆర్టీసీ అధికారులు మంగళవారం గ్రామంలో పర్యటించారు. ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై గ్రామానికి పంపించి పాఠశాల నిర్వహించాలని ఎంఈఓ డి.అబ్రహంను డీఈఓ ఆదేశించారు. అలాగే, పిల్లలకు యూనిఫామ్, పుస్తకాలు అందజేసి మధ్యాహ్న భోజన సదుపాయం సమకూర్చాలని సూచించారు. అలాగే, స్టాఫ్‌నర్స్, ఆశా కార్యకర్తను నియమిస్తామని డీఎంహెచ్ఓ కళావతిబాయి వెల్లడించగా, గ్రామానికి రోడ్డు వేస్తే బస్సు నడిపిస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ రాజశేఖర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కరామత్ అలీ, సూర్యనారాయణ, అచ్యుత్, సీఆర్‌పీలు పవన్, సైదబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నీకి జిల్లా జట్టు ఎంపిక



జిల్లా జట్టుతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: ఆదిలాబాద్ జిల్లా రామకృష్ణాపూర్‌లో బుధవారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనేందుకు జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఎంపిక చేసిన ఈ జట్టు మంగళవారం ఉదయం రామకృష్ణాపూర్ బయలు దేరింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్, రైల్వే సూపరిటెండెంట్ సుభాస్ చంద్రబోస్, డిప్యూటీ సూపరిటెండెంట్ ఎం.రాజేంద్ర, ట్రాక్ ఇంజనీర్ దేవిప్రియ, జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు రాజ్ ఆదినారాయణ అభినందించారు. ఈకార్యక్రమంలో క్రీడాకారులు కిషోర్, రమణ, కోచ్‌లు నోయల్ జాక్సన్, అశ్రిత్, మాధురి, శిరీష పాల్గొన్నారు.

అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు మేలు

వైరా: పత్తి రైతులు అధిక సాంద్రత విధానాన్ని పాటించడం ద్వారా దిగుబడి పెరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ఆయన పాల్గొన్నారు. ఈమేరకు వీసీలో శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశాక డీఏఓ మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతికి బదులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే 10 – 12 క్వింటాళ్ల దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే, రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏఓ మయాన్ మంజుఖాన్, ఏఈఓలు పాల్గొన్నారు.

ప్లాంటేషన్‌లోనే పోడుదారుల మకాం

కారేపల్లి: పోడు భూమి సాగు చేసుకోనివ్వాలని కోరుతూ పోడుదారులు అటవీ ప్లాంటేషన్‌లో బైఠాయించారు. మండలంలోని మాణిక్యారం–ఎర్రబోడు సమీప ఫారెస్టు ప్లాంటేషన్‌లో పోడుదారులు దున్నుతుండగా సోమవారం అటవీ అధికారులు అడ్డుకున్న విషయం విదితమే. ఈమేరకు ఎఫ్‌డీఓ వెంకన్న చేరుకుని రెండు రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. అయితే, మంగళవారం సైతం పోడుదారులుప్రజాసంఘాల మద్దతుతో ప్లాంటేషన్‌లోనే మకాం వేశారు. వంట సామగ్రి తెచ్చుకొని వంటావార్పు చేసుకున్నారు. వివిధ సంఘాల నాయకులు మెరుగు సత్యనారాయణ, కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, కరపటి సీతారాములు, పండగ కొండయ్య, ఐనాల వెంకటేశ్వర్లు, వజ్జా రామారావు వారికి మద్దతు తెలిపారు.

కళాశాలలో ఆకస్మిక తనిఖీ..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ హేమచందర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. అడ్మిషన్లు పెరిగేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. డ్రాపవుట్లు లేకుండా చూడాలని, ప్రతీ ఒక్కరూ కాలేజీకి వచ్చేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. అలాగే,హాస్టల్ వసతి సమస్యను పరిష్కరించాలని వార్డెన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.